కథ

# మళ్లీ నవ్వింది

హైదరాబాద్ స్టేషన్‌లో, ఒకటవ నంబరు ప్లాట్‌ఫారం మీదికి రైలు వచ్చి ఆగింది.

దిగి వెళ్లిపోయేవాళ్లూ, వాళ్ల కోసం వచ్చినవాళ్లూ, కూలీలు.. సందడిగా వుంది ప్లాట్‌ఫారం.

ఉదయం సమయం. చలిగా వుంది. అక్కడే వున్న రైల్వే ఆఫీసులో ఏదో పని చేసుకుంటు న్నాడు రామూ. ''సార్.. సార్!'' సన్నటి పిలుపు వినిపించింది. ఆ గొంతులో కాస్త నీరసం, భయం కూడా వుంది.

రాసుకుంటున్న రామూ తల ఎత్తి చూశాడు. ఏడు, ఎనిమిదేళ్ల వయసులో వున్న ఆడపిల్ల, చేతిలో బ్యాగ్‌తో నిలబడివుంది. బక్కగా వున్న ఆ పిల్ల, ఆ బ్యాగ్ మొయ్యలేక, క్రిందపెట్టింది.

''ఏమిటి?'' అన్నాడు ఆ పిల్లనే చూస్తూ.

''ఈ బ్యాగ్ రైలుపెట్టెలో దొరికింది సార్!'' అన్నది భయంగా.

క్షణం సేపు వులిక్కిపడ్డాడ రామూ. ''దొరికిందా? ఏ రైలు పెట్టెలో? ఎప్పుడు?''

యింకా ఏవో ప్రశ్నలు వేసేవాడేనేమో- బిక్క ముఖం వేసుకుని, ఆపిల్ల నిలబడిన తీరు చూసి ఆగిపోయాడు. ఆ పిల్లని చూశాడు పరిశీలనగా- పేదరికానికి ప్రతినిధిలా వుంది! అక్కడక్కడా చినుగులు పట్టి, మాసిపోయిన గౌను, రేగిన తల, చెప్పులు లేని కాళ్లూ -తెల్లగా, బక్కగా వుంది.

''ఎట్లా దొరికింది? చెప్పు''

''పెట్టెలో ఎక్కానుసార్! ఎవరైనా పైసలు యిస్తారేమోనని. ఎవ్వరూ యివ్వలేదు. వెనక్కి తిరిగి వస్తూంటే- అదిగో.. ఆ ఎస్. అయిదు నంబరు పెట్టెలో సీటు కింద వుంది''

''బ్యాగ్ తెరిచి చూశావా?''

''అమ్మతోడు! అస్సలు తెరవలేదు సార్! అట్లానే పట్టుకొచ్చిన''

''సరే... యింత చిన్న వయసులో అడుక్కుంటున్నావా?''

''మరేం చెయ్యాలి సార్! ఆకలేస్తది''

''మీ అమ్మని అడగాలి''

''మా అమ్మలేదు సార్! చచ్చిపోయింది. మా నాయన మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. ఆమెని అడిగితే, కొడతది. అసలుకి నన్ను వదిలేసి, మా నాయన, మా పిన్ని వెళ్లిపోయారు''

రామూకి ఆశ్చర్యం వెయ్యలేదుగానీ, బాధ కలిగింది.

ప్లాట్‌ఫారం హడావిడి కాస్త తగ్గింది. ఎవరో కాస్త కంగారుగా మాట్లాడుతూ వుంటే- బయటికి వచ్చి చూశాడు రామూ.


''ఈ ఎస్.. ఫైవ్ కంపార్టుమెంటు నుంచే దిగానండీ! బ్యాగ్ తీసుకోవటం మర్చిపోయాను. ఆటో ఎక్కేటప్పుడు చూసుకున్నాను. బ్యాగ్ లేదు. అందుకే వెంటనే మళ్లీ వచ్చాను. బోగీ ఎక్కి చూస్తే బ్యాగ్ లేదు'' ప్రక్కనున్న ఆయనతో చెబుతున్నది. కంగారూ, బాధా, ఆవిడలో తొంగిచూస్తున్నాయి. ప్రక్కన యిద్దరు పిల్లలూ, ఒక సూటు కేసూ, ఒక బ్యాగ్, ఇంకొంత సామానూ వుంది.

''నీకు ఎప్పుడూ కంగారే. నేను స్టేషనుకి వస్తాను అని చెప్పానుకదా! ఒక అయిదు నిముషాలు ఆలస్యమైంది రావటం. ఇప్పుడు చూడు. పోలీసు కంప్లెంటు యిచ్చినా..'' వాక్యం పూర్తి చెయ్యలేదు ఆయన.

''ఏం చేస్తాను..నా ఖర్మ!'' అంటున్నది ఆవిడ.

బ్యాగ్ తెచ్చినపిల్ల, రామూ..వాళ్ల మాటలు విన్నారు. ఆ పిల్లకి ఏం చెప్పాలో తెలియలేదు. రామూ ఆవిడ దగ్గరగా వెళ్లి ''ఎక్స్‌క్యూజ్ మీ! ఒకసారి ఆఫీసు రూముకి వస్తారా?'' అడిగాడు.

''ఎందుకండీ?'' అంటూనే, ఆవిడ రామూని అనుసరించింది.



సి. జయాబాలకృష్ణ

''ఈ బ్యాగ్ మీదేనా? చూడండి'' ఆ పిల్ల తెచ్చిన బ్యాగ్‌ని చూపించాడు.

ఆ బ్యాగ్‌ని ఆశ్చర్యంగా అటూ ఇటూ తిప్పి చూసింది. ఆనందపడిపో యింది.

''నాదేనండి'' అన్నది.

''లోపల అన్నీ వున్నాయో లేవో చూడండి'' అన్నాడు రామూ.

బ్యాగ్ జిప్ తీసి, అన్నీ చూసింది. తన బట్టలూ, బట్టల లోపల ఎక్కడో చిన్న పర్సులో దాచిన బంగారు గొలుసూ, గాజులూ, రెండు అయిదు వందల రూపాయల నోట్లూ- అన్నీ భద్రంగా వున్నాయి. అన్నీ తను ఎలా సర్దుకున్నదో అలాగే వున్నాయి. ఆవిడకి చాలా ఆనందంగా వుంది. ''ఈ బ్యాగ్ నాదే సార్! లోపల...యిదిగో...యీ అడ్రస్సు పుస్తకం నాతో ఎప్పుడూ వుంటుంది. నేను ఎలా సర్దుకున్నానో అలాగే వుంది. చాలా చాలా థ్యాంక్స్ సార్! మీకు ఎలా దొరికింది సార్?'' ప్రశ్నల వర్షం కురిపిం చింది.

''నాకు దొరకలేదు. ఇదిగో, యీ పిల్లకి దొరి కింది''

అప్పుడు చూసింది ఆవిడ..ఆ పిల్లవంక. ''ఏమే! చాలామంచి పిల్లవి లాగే వున్నావే! బ్యాగ్ తెరిచి చూసినట్టు కూడా లేదు. ఈ కాలంలో పోయిన వస్తువుని యిలా తెచ్చియిచ్చేదెవరు? అదృష్టం! లేచిన వేళ బాగుంది. యింద..యీ పది రూపాయలు తీసుకో!'' పది రూపాయల నోటు ఆ పిల్లకి అందించింది.

ఆ పిల్ల తీసుకోలేదు. ''వద్దు'' అన్నది తలవం చుకుని.

''ఎందుకే...నీలుగుతున్నావు? తీసుకో!'' కాస్త గట్టిగానే అన్నది.

రామూకి ఆవిడ మాట ధోరణి నచ్చటం లేదు. కానీ మౌనంగానే వున్నాడు.

''నాకొద్దు'' అన్నది ఆ పిల్ల- ఆవిడ వంక చూసి.

''తిండిలేకపోయినా బాగానే నీలుగుతు న్నావు..నీ ఖర్మ!'' అని ''చాలా థ్యాంక్సండీ! వస్తా నండీ!'' అని రామూతో చెప్పి, వెళ్ళిపోయింది ఆవిడ.


రామూ కుర్చీలో కూర్చుని, ఆ పిల్లనే చూస్తూ కూర్చున్నాడు.

చిన్నపిల్ల! నీరసంగా కనిపిస్తున్నది. పాపం..ఎవ్వరూ లేరు. ఆకలేస్తున్నదో ఏమిటో!

''నీ పేరేమిటి?''

''మల్లి''

''ఆకలేస్తున్నదా?'' మర్చిపోలేని తన గతం తాలూకు అనుభవం గుర్తుకు వచ్చింది.




''అవును'' అన్నట్టు బుర్రవూపింది.

ఆఫీసు గది గుమ్మం బయటికి వచ్చాడు రామూ. అక్కడే వున్న ఆఫీసు ప్యూనుని పిలిచి, యిడ్లీ, కాఫీ తెప్పించాడు.

ఇడ్లీ తిన్నది మల్లి. కాఫీ తాగింది.

''చూడు మల్లీ! నీకు ఆకలేసింది కదా! యిందాక ఆవిడ డబ్బులిస్తే ఎందుకు తీసుకో లేదు?''

''ఏమో?''

''ఊ..''

కాసేపు నిలబడి ''నేను ఎల్తాను సార్!'' అన్నది.

''మీ నాయన, మీ పిన్ని, నిన్ను వదిలి వెళ్లిపో యారు అన్నావు కదా! మరి ఎక్కడికి వెళ్తావు?''

''మా దుర్గ కాడికి వెళ్తా!''

''దుర్గ ఎవరు?''

''మా దోస్త్. చాలా మంచిది. రాత్రిపూట దాని యింటి దగ్గర పడుకుంటా''

మల్లి అలా మాట్లాడుతూ వుంటే- రామూకి మనసులో ఏ మూలో అడుగున పడిన బాధ ఒక్క సారి పైకి లేచింది, మనసు కలుక్కుమన్నది. ఈ మల్లి బ్రతుకు ఏమవుతుంది? ఎలా బ్రతుకు తుంది? దీని భవిష్యత్తు ఏమిటి? అలా ఆలో చిస్తూ వుంటే... సుమారు పాతికేళ్ల నాటి తన గతం...అవును...తన గతమే..సినిమా రీలులా కళ్లముందు మెదిలింది.

★ ★ ★

రైలు వేగంగా పరుగులు తీస్తున్నది.

ఉదయం ఆరు గంటలు కావస్తున్నది. ఏడుగం టలకి కానీ, ఆ రైలు హైదరాబాద్ చేరదు. ఎస్.ఎని మిదవ నంబరు బోగీలో వున్న చందూలాల్ యింకా నిద్రలోనే వున్నాడు. బలవంతాన లేచి కూర్చున్నాడేగానీ ఆయన్ని నిద్ర యింకా వదల్లేదు. కూర్చునే కునికిపాట్లు పడుతున్నాడు.

''పాలీష్‌సార్! బూటు పాలీష్ సార్!'' ఓ పదేళ్ల అబ్బాయి, చిన్న బూటు పాలీష్ సంచితో వచ్చాడు ఆ రైలు పెట్టెలోకి.

ఉదయం సమయం. ఇంకా వెలుగు పూర్తిగా రాలేదు. ఎవరి హడా విడిలో వాళ్లు వున్నారు.

ఎప్పుడు వూరు వస్తుందా, ఎప్పు డెప్పుడు యీ రైలు దిగి, యిళ్లకి చేరు కుంటామా అనే ఆలోచనలో వున్నారు. అంత వుదయమే, వాళ్లు వేసుకున్న బూట్లూ, చెప్పులూ, వాటి పాలీష్ గురించి ఆలోచించే స్థితిలో లేరు.

ఏ ఒక్కరైనా పాలీష్ చేయించుకుంటారేమో, రెండు రూపాయలు వస్తే, టీనీళ్లు అయినా తాగొచ్చని పాలీష్ చేసే అబ్బాయి ఆశ!

హైదరాబాద్ స్టేషన్ వచ్చింది. రైలు ఆగింది. అందరూ దిగిపోతున్నారు హడావిడిగా.

ఉలిక్కిపడి లేచాడు చందూలాల్. సూటు కేసు తీసుకుని, హడావిడిగా దిగిపోయాడు.

రైలు పెట్టెలోపల- ఆ చివరి నుంచీ, ఈ చివరి వరకూ బూట్ పాలీష్ సంచీ పట్టుకుని, తిరు గుతూ మళ్లీ వచ్చాడు బూటుపాలీష్ అబ్బాయి ఎస్.ఎనిమిదవ బోగీలోకి.

అందరూ దిగిపోయారు. ఖాళీగా వుంది రైలు పెట్టె- అటూ, యిటూ చూసుకుంటూ, ఒక సీటు క్రింద చూశాడు. ఆ సీటు క్రింద నల్లగా కని పించింది. పరీక్షగా చూశాడు. చిన్న హ్యాండ్ బాగ్. ముందుకు లాగి చూశాడు. కాస్త బరువుగానే వుంది. దానిమీద పేరుగానీ, అడ్రస్సు గానీ లేవు.

బ్యాగ్ పట్టుకుని రైలు దిగాడు. ప్లాటుఫారం మీద నిలబడ్డాడు. ఆ బ్యాగ్ కోసం ఎవరైనా వస్తారే మోనని చూశాడు. ఎవ్వరూ రాలేదు. ప్లాటుఫారం మీద నడుచుకుంటూ ఎవరూ లేని, ఖాళీ బెంచీ మీద కూర్చున్నాడు బ్యాగ్ పక్కన పెట్టుకుని.

'ఏముంది యీ బ్యాగ్‌లో? తెరిచి చూస్తే?' అనిపించింది. 'అమ్మో!' అని కూడా అనిపిం చింది. మళ్లీ అనిపించింది వాడికి - 'తెరిచి చూస్తే?' అని. చిన్నపిల్లవాడికి వుండే కోరిక, కుతూహలం, ఆతురత..క్షణం సేపు 'అమ్మో!' అన్న భయాన్ని పక్కకి నెట్టాయి.

తాళం లేదు బ్యాగ్‌కి. బ్యాగ్ జిప్ తీశాడు. బ్యాగ్ తెరుచుకుంది. అందులో ఓ జత బట్టలూ- పైజమా, లాల్చీ, ఒక తువ్వాలు, మరో నల్ల పర్స్-కొంచెం పెద్దగా, లావుగా వుంది. ఆ పర్సు జిప్ తీశాడు. అందులో డబ్బు! ఎన్ని నోట్లో!

**ఆంధ్రభూమి-ఆటా పోటీలో ఎంపికైన కథ**

బంగారు నగలు కాబోలు! అమ్మో ఎంత డబ్బో! ఎన్ని నగలో! బాబోయ్! వెంటనే భయం వేసింది వాడికి. వెంటనే పర్సు జిప్ మూశాడు. బ్యాగ్ జిప్ కూడా మూసేశాడు.

వాడి మనసులో భయమూ, ఆందోళన! ఎంత డబ్బో! నగలు కూడా వున్నాయి! ఈ బ్యాగ్ తన దగ్గర వున్నట్టు ఎవరైనా చూస్తే..తంతారు. పోలీసులు పట్టుకుంటారు. పోలీసులూ తంతారు. తనని 'దొంగ' అంటారు.

పోనీ- ఈ బ్యాగ్‌ని యిక్కడ వదిలేసి, తను వెళ్లిపోతే? అనిపించింది.

ఆ ఆలోచన వాడికి అంతగా నచ్చలేదు. బ్యాగ్‌ని అక్కడే వదలాలనిపించలేదు. రెండు, మూడు నిముషాలు తరువాత ఆ బ్యాగ్‌ని, తన బూటు పాలీష్ సంచీనీ భుజాన వేసుకున్నాడు. అక్కడే వున్న రైల్వే అథారిటీస్ ఆఫీసులోకి వెళ్లాడు.

ఆఫీసులో రైల్వే ఉద్యోగి ఏదో రాసుకుంటూ కూర్చున్నాడు.

''సార్!'' పిలిచాడు.

''ఏమిటి?'' తల ఎత్తకుండానే అన్నాడు రైల్వే ఉద్యోగి యాంత్రికంగా-

''రైల్వే బోగీలో నాకు ఈ బ్యాగ్ దొరికింది సార్!'' అన్నాడు.

అప్పుడు తలెత్తి చూశాడు రైల్వే వుద్యోగి.

''బ్యాగ్ దొరికిందా?''

''అవును సార్! ఓ అరగంట క్రితం ఈ స్టేషన్‌కి వచ్చి, యిదే ప్లాట్‌ఫారం మీద ఆగింది''

''బ్యాగ్ తీసుకుని, చూశాడు రైల్వే వుద్యోగి. బ్యాగ్‌కి తాళం లేదు. బ్యాగ్ జిప్ తీసి చూశాడు. బట్టలు వున్నాయి. అందులో మరో పర్సు వుంది. అది లావుగా వుంది. దాని జిప్ తీసి చూశాడు. అందులో నోట్ల కట్టలూ, కొన్ని బంగారు నగలూ వున్నాయి.

రైల్వే ఉద్యోగికి ఆశ్చర్యం వేసింది 'ఎవరు? ఎలా? ఈ బ్యాగ్ ని యింత నిర్లక్ష్యంగా వదిలిపోయారు? ఇంత డబ్బూ, నగలూ..!'

''ఒరే..నీ పేరేమిటి?''

''రామూ సార్''

''ఈ బ్యాగ్ నిజంగా నీకు దొరికిందా? లేకపోతే దొంగతనం చేసి, పోలీసులు పట్టుకుంటారని, తంతారని భయపడి తీసుకువచ్చావా?''

''అమ్మ తోడు సార్! నేను దొంగతనం చెయ్యలేదు సార్!'' చెయ్యి నెత్తిన పెట్టుకున్నాడు.

''ఎలా దొరికిందిరా?''

''బూటు పాలీష్ ఎవరైనా చేయించుకుంటారేమోనని రైలు ఎక్కాను సార్! ఎవ్వరూ చేయించుకోలేదు. ఇంతలో యీ స్టేషన్ వచ్చింది. అందరూ దిగిపోయారు. నేను మళ్లీ ఎస్.ఎనిమిది బోగీలోకి వచ్చాను. ఎవ్వరూ లేరు. సీటు కింద ఈ బ్యాగ్ దొరికింది''

''ఊ...! ఇంత వుదయమే ఎవరు బూటుపాలీష్ చేయించుకుంటార్రా! నువ్వు చెప్పేది నమ్మమంటావు. ఈ బ్యాగ్‌ని తెరిచి చూశావా!'' అడిగాడు రైల్వే వుద్యోగి.

మాట్లాడలేదు రామూ. వాడికి భయంగా వుంది.

''చెప్పు'' కఠినంగా వుంది రైల్వే వుద్యోగి గొంతు.

'అబద్ధాలు చెప్పకూడదు' రామూకి తల్లి మాటలు గుర్తువచ్చాయి.


''చూశాను సార్!'' వాడికి చాలా భయంగా వుంది. 'ఏం చేస్తారు తనని? పోలీసులకి పట్టిస్తారా? పోలీసులు తంతారా? జైల్లో పెడతారా? అయినా, తను తప్పు చెయ్యలేదుగా! దొంగతనం చెయ్యలేదు, అబద్ధం చెప్పలేదు-కొడతారా?'

''ఊ..'' ముక్తసరిగా అన్నాడు రైల్వే ఉద్యోగి.

మళ్లీ ఒకసారి ఆ బ్యాగ్ తెరిచి, కాస్త వివరంగా చూశాడు. ఆ బ్యాగ్‌లో బట్టల క్రింద వెతికాడు. చిన్న పుస్తకం దొరికింది. తెరిచి చూశాడు. 'చందూలాల్' అని వున్న అడ్రస్సు, టెలిఫోన్ నంబరూ వున్నాయి. ఆ పేరువున్న మనిషి ఆ బ్యాగ్ యజమాని అవునో, కాదో తెలియదు. అంతకంటే వివరాలు లేవు. పోలీసు కంప్లైంటు యిస్తే, ఒక పెద్ద చరిత్రలా అవుతుంది. ఈ రామూని, ఆ పోలీసులు హింసపెట్టినా పెట్టచ్చు. అందుకే..ఈ చందూలాల్‌కి ఫోన్ చేసి, ప్రయత్నం చేద్దాం అనిపించింది రైల్వే వుద్యోగికి.

ఆ పుస్తకంలో వున్న ఫోన్ నంబరుకి, చందూలాల్‌కి ఫోన్ చేశాడు. అవతలినుంచి పలికిన వ్యక్తి చందూలాలే! రైల్వేస్టేషన్‌కి రమ్మని, తను ఎక్కడ వున్నదీ చెప్పి, అక్కడికి వచ్చి వెంటనే కలుసుకోమనీ చెప్పాడు ఫోనులో.

రైల్వేస్టేషన్ నుంచి ఫోన్! తనని రమ్మని చెప్పగానే, చందూలాల్ ఆఘమేఘాల మీద వచ్చాడు రైల్వేస్టేషన్‌కి.



విషయం అడిగి తెలుసుకున్నాడు. ''ఈ బ్యాగ్ నాదే సార్! ఇంటికి వెళ్లి చూసుకున్నాను. బ్యాగ్ లేదు. పోలీస్ కంప్లైంటు యివ్వాలనుకుంటున్నాను. యింతలో మీ ఫోన్ వచ్చింది'' అన్నాడు చందూలాల్.

అన్నీ చూసుకున్నాడు చందూలాల్. పర్సులో డబ్బు లెక్కపెట్టుకున్నాడు. ఇరవై వేలు! సరిగ్గా వున్నాయి. నగలు చూసుకున్నాడు. అన్నీ సరిగ్గా వున్నాయి.

''అన్నీ సరిగ్గా వున్నాయి సార్! డబ్బూ, నగలూ అన్నీ సరిగ్గా వున్నాయి'' ఆనందంగా అన్నాడు.

''ఇదిగో..వీడూ!..ఈ రామూ తీసుకువచ్చి యిచ్చాడు. మీ బ్యాగ్ తెరిచి చూశాడుట. అందులో డబ్బూ, నగలూ-అన్నీ చూశాడుట. మా ఆఫీసుకి వచ్చి నాకు యిచ్చాడు. మీరు థ్యాంక్స్ చెప్పవలసింది వీడికి'' అన్నాడు రైల్వే వుద్యోగి.

అప్పుడు చూశాడు చందూలాల్, రామూ వంక. బిక్కు బిక్కుమంటూ అక్కడే నిలబడి వున్నాడు రామూ.

''రామూ! చాలా థాంక్స్‌రా అబ్బాయి. మంచి వాడివి. ఇదిగో..యిది వుంచుకో!'' యాభై రూపాయల నోటు అందించాడు.

''వద్దుసార్!''

''పరవాలేదురా! తీసుకో. నువ్వు చాలామంచి వాడివి. పైకి వస్తావు'' అతి బీదగా వున్న రామూని చూస్తూ అన్నాడు. రెండుసార్లు బ్రతిమిలాడాడు చందూలాల్. రామూ వినలేదు.

''తీసుకో రామూ!'' అని రైల్వే వుద్యోగి ఎంత చెప్పినా తీసుకోలేదు రామూ.

చందూలాల్ రైల్వే వుద్యోగికీ, రామూకి మరొకసారి థాంక్స్ చెప్పి, వెళ్లిపోయాడు.

''సార్!'' రామూ పిలిచాడు కొంతసేపు తరువాత.

అప్పుడు చూశాడు రైల్వే ఉద్యోగి వివరంగా రామూ వంక.

మాసిపోయి, వినిగిపోయిన చొక్కా, లాగూ, అమాయకమైన ముఖమూ, ఎంతమందికో బూట్లు పాలీష్ చేస్తున్నా, చెప్పులు లేని వాడి కాళ్లూ, పక్కన పెట్టివున్న బూటు పాలీష్ సంచీ-! సుమారు పదేళ్ల వయసు వుంటుందేమో వాడికి.

''ఏమిటిరా?'' వాడినే చూస్తూ అడిగాడు.

''ఆకలేస్తోంది సార్!'' కాస్త అభిమానంగా సిగ్గుగా అడిగాడు.

బాధపడ్డాడు రైల్వే ఉద్యోగి- ఆశ్చ

ర్యమూ వేసింది. అక్కడే వున్న పనివాడిని పిలిచి టిఫినూ, కాఫీ తెప్పించాడు.

టిఫిన్ తిని కాఫీ తాగాడు రాముా.

కడుపునిండింది రామూకి. నిన్నటి నుంచీ తిండిలేదు వాడికి. టిఫిన్ తిని, కాఫీ తాగిన తరువాత హాయిగా అనిపించింది.

''ఏం రామూ! మరి...యిందాక ఆ చందూలాల్ డబ్బు యిస్తే ఎందుకు తీసుకోలేదు?''

''తీసుకోవాలనిపించలేదు సార్!'' అంత కంటే కారణం వివరించలేకపోయాడు.

రామూ వివరాలు అడిగాడు రైల్వే ఉద్యోగి.

''నేను పుట్టిన కొత్తల్లోనే, మా నాన్న మా అమ్మని వదిలేసి పోయాడుట. మా అమ్మ చెప్పింది. మా అమ్మ నన్ను పెంచింది. ఇళ్లల్లో కష్టపడి పనులు చేసేది. నన్ను ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్పించింది. నేను మూడో క్లాసు చదువుకున్నాను సార్! చదువుకోవడమంటే నాకు చాలా యిష్టం సార్. మా అమ్మకీ చదువంటే యిష్టం సార్!''

''మరి స్కూలుకి వెళ్లకుండా- ఈ పాలిష్ పనేమిటి?''

''అప్పుడు...అప్పుడు మా అమ్మకి టైఫాయిడ్ జ్వరం వచ్చింది సార్. సరియైన మందు లేదు. చచ్చిపోయింది సార్ మా అమ్మ! మా అమ్మ చచ్చిపోయిన తరువాత ఇంకెలా సార్! స్కూలు మానేశాను సార్! మా యింటి పక్కనున్న వీరయ్య తాత నాకు యీ బూటు పాలిష్ బ్యాగ్ యిచ్చాడు. రైలు బోగీలో ఎక్కి, ఎవరికైనా పాలిష్ చేస్తూ వుంటాను. ఒకరోజు పది రూపాయలు వస్తుంది. ఒక రోజు రెండు రూపాయలే వస్తుంది. నిన్న డబ్బులు ఏం రాలేదు. అందుకే ఏం తినలేదు. ఆకలేసింది. పొద్దునే వచ్చాను. ఏమైనా బేరం దొరికితే- ఏదైనా తినచ్చు అని. మా అమ్మ చాలామంచిది సార్! తను కష్టపడి పనిచేసి, నన్ను ఎలాగైనా బాగా చదివించాలనుకునేది. 'అబద్ధం చెప్పకూడదూ, దొంగతనం చెయ్యకూడదు, అడుక్కోకూడదు' అని చెప్పేది''

''మీ అమ్మ అంటే నీకు అంత యిష్టమా?''

''చాలా యిష్టం. నేను బాగా చదువుకుని, సంపాదించుకుని, మా అమ్మని ఏ కష్టం లేకుండా చూసుకోవాలనుకున్నాను. ప్చ్...చచ్చిపోయిందిగా మా అమ్మ!'' తల్లిని గురించిన బాధ తొంగి చూసింది వాడి గొంతులో. ''ఊ..''

''వెళ్తానుసార్! థ్యాంక్స్ సార్!'' అన్నాడు. ''ఎక్కడ వుంటావు నువ్వు?'' అడిగాడు రైల్వే వుద్యోగి.

తను ఎక్కడ వుండేదీ వివరాలు చెప్పాడు రామూ. వెళ్లిపోయాడు.

రైల్వే వుద్యోగి రామూని గురించే ఆలోచిస్తూ కూర్చున్నాడు. రామూ నిజాయితీ నచ్చింది. చిన్నవాడైనా, యివ్వాళ వాడు చేసిన పని చాలా గొప్పపని. మంచిపిల్లవాడు...వాడికి ఏదైనా సహాయం చేస్తే? రామూకి ఏదైనా సహాయం చెయ్యాలనుకున్నాడు రైల్వే ఉద్యోగి.

★ ★ ★

రామూ నిజాయితీకి, రామూకి ఒక గుర్తింపు కావాలి అనుకున్నాడు రైల్వేవుద్యోగి. తనతోటి వుద్యోగులు కొంతమందితో రామూ గురించిన వివరాలూ, జరిగిన సంగతీ అన్నీ వివరంగా మాట్లాడాడు.

వెనుకబడిన జాతుల హక్కుల పరిరక్షణ సంఘం (షెడ్యూల్డ్ క్యాస్ట్స్, రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ) వారికి తెలియచేశాడు.

వారు, రైల్వే వుద్యోగీ కలిసి-చిన్న సభ ఏర్పాటు చేశారు రామూ గురించి. జిల్లా కలెక్టరు గారిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.

ఇంకా యిద్దరు, ముగ్గురు పెద్దలతో, చందూలాల్, రైల్వే వుద్యోగితో సభ ఏర్పాటు అయింది. రామూకి విసుగ్గానూ, కాస్త భయంగానూ వుంది. సభ ప్రారంభమైంది.

రైల్వే ఉద్యోగి రామూని గురించి సభకి తెలియచేశాడు. రామూ ఆరోజు చేసిన గొప్పపని గురించి, వాడి నిజాయితీ గురించీ, వాడి మంచితనం గురించీ సభ వారికి తెలియజేశాడు. చందూలాల్ కూడా ఆ రోజు జరిగిన సంగతి, రామూ గురించీ, వివరించాడు.

రామూకి సన్మానం చేశారు. మెళ్లో పూలదండ వేశారు. శాలువా కప్పారు. రామూ బిక్కు-బిక్కుమంటూ వేదిక మీద, ఓ ప్రక్కన చివరి కుర్చీలో ఒదిగి కూర్చున్నాడు.

జిల్లా కలెక్టరు గోపాల్‌గారు రామూకి బూటు షాపు పెట్టుకునేందుకు కావలసిన ఆర్థిక సహాయం, ఆ షాపుని ఏర్పాటు తనే చేయిస్తానని, అందుకు తగిన మంచి ప్రదేశం అన్నీ ఏర్పాటు చేస్తానన్నారు.




ముందు రామూకి బూటుషాపుకి సంబంధించిన వర్కు షాపులో శిక్షణ పొందేందుకు వెంటనే ఏర్పాటు చేస్తాను. మట్టిలో మాణిక్యంలాంటి రామూలాంటి పిల్లల్ని పైకి తీసుకురావాలి అని సభాముఖంగా తెలియచేశారు. సభలో అందరూ సంతోషించారు మంచిపిల్లాడు రామూకి న్యాయం జరిగింది అని. సభలో కరతాళ ధ్వనులు మ్రోగాయి. ఆనాటి సభా కార్యక్రమాన్ని, దూరదర్శన్‌వారూ, పది నిముషాలు డాక్యుమెంటరీ కూడా తీశారు.

సభ ముగిసింది.

ఎక్కడివారు అక్కడ వెళ్లిపోతున్నారు. మెడలో పూలదండ, శాలువా అక్కడే కుర్చీమీద పెట్టి, బయటికి పరుగుతీశాడు రామూ.

కలెక్టరు గోపాల్‌గారు కారు దగ్గరికి వచ్చారు. ఆయన్ని చూసి, రామూ పరుగు పరుగున వచ్చాడు ఆయన కారు దగ్గరికి.

''ఏం కావాలి రామూ! నీ గురించి నేను చెప్పినవన్నీ వెంటనే చేస్తాను..త్వరలోనే''

భయంగా వుంది రామూకి మనసులోది అడగటానికి. ''ఏం కావాలో చెప్పు రామూ! సార్ అడుగుతూ వుంటే, మాట్లాడవేం?'' కలెక్టరుగారి కారు డ్రైవరు కాస్త గట్టిగా అన్నాడు.

''సార్! మరీ మరి..నాకు స్కూలుకి వెళ్లి, చదువుకోవాలని వుంది సార్!'' చెప్పి భయంగా తల వంచుకున్నాడు.

ఆశ్చర్యపోయాడు కలెక్టరు గోపాల్‌గారు. ''అంటే..నీకు బూటుషాపు, దానికోసం నిన్ను ట్రైనింగుకి పంపటం- నీకు యిష్టంలేదా?''

భయంగానే - బుర్ర అడ్డంగానే తిప్పాడు.

''రామూ! పొగరా నీకు? నీకోసం..నీకు ట్రైనింగు యిప్పించి, నీ గురించి సార్ పెద్ద బూటు షాపు పెట్టిస్తానంటే వద్దంటావేంటి? బుద్ధిలేదూ నీకు?'' కలెక్టరుగారి కారుడ్రైవరు కేకలేశాడు.

మాట్లాడలేదు రామూ.

''నువ్వు వుండు గణపతీ!'' కలెక్టరుగారు డ్రైవరుని మందలించారు.

''రామూ! నీకు స్కూలుకి వెళ్లి, చదువుకోవాలని వున్నదా?''

''అవును సార్!'' మెల్లగా అన్నాడు.

అయిదు నిముషాలు ఆలోచించారు కలెక్టరుగారు. ''రామూ కారెక్కు'' అన్నారు.

''సార్! నా పాలిష్ బ్యాగ్ తెచ్చుకుంటాను'' దానికోసం వెళ్లబోయాడు.

''దాని అవసరం లేదులే..నువ్వు కారెక్కు'' అన్నారు.

★ ★ ★

కలెక్టరు గోపాల్‌గారు రామూని యింటికి తీసుకువెళ్లారు. రామూ

గురించి భార్యకి విషయమంతా వివరించారు. కానీ- రామూ యింట్లో వుండటానికి ఆయన భార్య వొప్పుకోలేదు. కలెక్టరుగారు వదల్లేదు. ఒక క్లాసు తక్కువైనా- మంచి స్కూల్లో రామూని చేర్పించారు. హాస్టల్లో చేర్పించారు. అందుకు కలెక్టరుగారి భార్య అభ్యంతరం చెప్పలేదు. అమ్మగారు మంచివారు అనుకున్నాడు రామూ. శలవుల్లో కూడా- నాలుగు, మూడు రోజులు తప్ప, మిగతా రోజులు రామూ హాస్టల్లో వుండేందుకే ఏర్పాటు చేశారు.

రామూ చదువు సాఫీగా సాగిపోయింది. రామూ పెద్ద పెద్ద కలలు కనలేదు. తను చదువుకోవాలనే తన అమ్మకోరిక కొంతవరకైనా తీరింది అని ఆనందపడ్డాడు. మంచిమార్కులతో, డిస్టింక్షన్‌తో డిగ్రీ పూర్తి చేశాడు. అస్తమానం రామూ తల్లిని గుర్తుచేసుకుంటూనే వుంటాడు. తల్లి మాటలు యిప్పటికీ వేదవాక్కు రామూకి, డిగ్రీ పూర్తి చేసిన తరువాత, బ్యాంకు వుద్యోగం పరీక్షలు, రైల్వే రిక్రూట్‌మెంటు బోర్డు పరీక్షలూ రాశాడు. రైల్వే వుద్యోగానికి యింటర్ వ్యూ వచ్చింది. అయ్యగారు చిన్నమాట సాయం చేశారు. వుద్యోగం వచ్చింది.


రామూ ఆనందానికి అవధుల్లేవు. తను బూటుపాలీష్ అబ్బాయి స్థితి నుంచి ఈ స్థితికి రావటానికి రైల్వే వుద్యోగి సార్, అయ్యగారూ మాత్రమే కారణం. వాళ్లు యిద్దరూ తలుచుకోకపోతే- తను ఎక్కడ వుండేవాడో- ఆ సంగతి తలుచుకున్నప్పుడల్లా- మనసు బాధగా వుంటుంది. అప్పుడప్పుడూ రైల్వేసార్‌ని కలిసి వస్తూ వుంటాడు యిప్పటికీ.

ఉద్యోగం చేసుకుంటూ, ప్రయివేటుగా ఎమ్.ఏ. పరీక్షలు రాసి పాసైనాడు. ప్రయివేటుగానే ఎమ్.బి.ఏ చదువుకున్నాడు. ఇదంతా తనకి చదువంటే యిష్టంతోనే.

కలెక్టరుగారు ఆయనకి తెలిసిన కుటుంబంలోని బీదపిల్ల-సీతని యిచ్చి పెళ్లి చేశారు ఆయనే. సీతకి తండ్రి లేడు. తల్లి వుంది. సీత తల్లి ఎవరింట్లోనో వంటలు చేసుకుంటూ, కష్టపడి, సీతని డిగ్రీ వరకూ చదివించింది. సీత ఓ చిన్న ప్రయివేటు స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నది. సీత తల్లి కూడా రామూ దగ్గరే వుంటుంది.

రామూకి ఒక్క కొడుకు. ఒక్కడు చాలు అనుకున్నారు. వాడ్ని బాగా చదివించి పైకి తీసుకురావాలనుకున్నారు. కొడుక్కి కలెక్టరుగారి పేరు పెట్టుకున్నాడు.

ఆనాడు- తన మాట కాదన్నా, కోపగించకుండా, కలెక్టరుగారు ఆదుకుని తన కోరికని తీర్చకపోయివుంటే, ఈరోజు తను ఈ స్థితిలో వుండేవాడు కాదుగా!' గతంలోని ఆలోచనలకి స్వస్తి చెప్పాడు రామూ.




★ ★ ★

గతం తాలూకు ఆలోచనల్లో నుంచి తేరుకుని, వాస్తవంలోకి వస్తే- ఎదురుగా నిలబడి వుంది మల్లి. చర్విత చరణంలాగా- ఇన్ని సంవత్సరాల తరువాత తనకి జరిగిన అనుభవంలాగానే- ఈ మల్లి తన అనుభవంలోకి వచ్చింది.

'భగవాన్! ఈ మల్లి! ఒక అనాథ! ఆడపిల్ల!' మల్లిని అలాగే వదిలేయాలని అనిపించలేదు రామూకి. 'వదిలేస్తే... ఏమవుతుంది? పేవుమెంట్ల మీద దాని బ్రతుకు. అంతకంటే అది ఎదగలేదు. ఆ తరువాత, దానికి వయసు వచ్చాక ఏమవుతుంది దాని బ్రతుకు?' ఊహకే భయం వేసింది రామూకి.

రైల్వే వుద్యోగి సార్ లాగా- మల్లికి ఓ గుర్తింపు కావాలనే తాపత్రయపడలేదు తను. సభలూ, సమావేశాలూ, గుర్తింపులూ, సన్మానాలూ- ఇవేవీ తను చేయలేదు.

'ఎవరో, ఏదో చెయ్యాలి' అనుకునే కంటే- తనే ఏదైనా చెయ్యాలి.

దేశంలో వున్న అనాథ పిల్లల్నీ, బీదపిల్లల్నీ అందరినీ ఆదుకునే శక్తి తనకి లేకపోవచ్చు. కానీ- ఈ మల్లి నిజాయితీ, అమాయకత్వం, పసితనం, అనాథ, ఆడపిల్ల! ఇవన్నీ కలిపి, తనకి మల్లిని వదిలేయాలనిపించటం లేదు.

కానీ... ఇంట్లో మరి సీత ఏమంటుంది? ఆనాటి కలెక్టరు అమ్మగారిలా అభ్యంతరం చెబుతుందా? మనం పెంచలేక, ఒక్కడే చాలు అనుకున్నప్పుడు, ఈ పిల్లని తెచ్చావేమిటి? ఆడపిల్లని పెంచటం మాటలా? లేనిపోని బరువుని మనం మొయ్యగలమా అంటుందా? ఎన్నో ఆలోచనలు! ఏవేవో సందేహాలు...ఏవో కొద్దిగా భయాలూ... మనసులో ఏ మూలో సీత ఏమంటుందో నన్న భయంగా వున్నా, రామూ మల్లిని గురించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

''మల్లీ! నాతో వస్తావా?'' అడిగాడు.

''ఎక్కడికి సారూ?''

''మా యింటికి''

''ఎందుకు?''

''మా యింట్లో, మాతో వుందువుగాని''''అమ్మో! నాకు భయం'' మల్లికి తన సవితి తల్లి గుర్తువచ్చింది.

''ఏం భయం లేదు. మా యింట్లో వుందువుగాని. మా యింట్లో గోపాల్ అని, ఒక బాబు వున్నాడు. ఒకటవ క్లాసు చదువుతున్నాడు. వాడితోపాటు నువ్వు కూడా స్కూలుకి వెళ్లువుగాని''

''నాకు భయం సారూ!''

''ఏం భయం లేదు. నేనున్నానుగా!'' అన్నాడు. త్వరగా తన డ్యూటీ పూర్తి చేసుకుని, మల్లిని తీసుకుని, యింటికి వెళ్లాడు రామూ.

★ ★ ★

''ఎవరు రామూ యీ పిల్ల?'' రామూకి మంచినీళ్లు యిచ్చి అడిగింది సీత.

''సీతా! కూర్చో! నీతో మాట్లాడాలి'' అని ఆరోజు జరిగిన విషయమంతా వివరంగా చెప్పాడు రామూ. సీత తల్లి కూడా రామూ చెప్పేదంతా వింటూ అక్కడే కూర్చున్నది.

సీత మాట్లాడలేదు.

''సీతా! నీ అభిప్రాయం చెప్పు. మల్లి మన యింట్లో వుండటం నీకు యిష్టం లేకపోతే వేరే మార్గం ఆలోచిద్దాం. బలవంతంగా నేను నీ మీద రుద్దను''

''లేదు రామూ! మీ మంచితనం గురించి ఆలోచనలో క్షణంసేపు మాట రాలేదు. నాకు యిష్టమే. మల్లిని మన యింట్లోనే వుంచుకుందాం. మీరు చేసే ఈ మంచిపనికి, నేనూ మనస్ఫూర్తిగా సహకరిస్తాను. మల్లి మన యింట్లోనే వుంటుంది. దాన్ని స్కూలుకి పంపిద్దాం. చదువుకుంటుంది. మల్లి అనాథ కాదు. దానికి మనం అందరం వున్నాం'' అన్నది సీత.

చాలా ఆనందం వేసింది రామూకి. ''ఏమ్మా మీరేమంటారు?'' సీత తల్లిని అడిగాడు.

''తప్పకుండా బాబూ! నావంతు సాయం చేస్తాను'' అన్నది ఆవిడ. రామూ అయిదేళ్ల కొడుకు చూస్తూ నిలబడ్డాడు మల్లిని.

''మల్లీ! నీకేం భయం లేదు. యిది నీ యిల్లు. చిన్నబాబు గోపాలు వున్నాడు. నువ్వు యిక్కడే వుందువుగాని. స్కూలుకి వెళ్లి, చదువుకుందువుగానీ'' ఆనందంగా అన్నాడు రామూ మల్లిని దగ్గరికి తీసుకుని. రామూ మాటలు ఎంతవరకూ అర్థమయ్యాయోగానీ మల్లి నవ్వింది.

అమాయకంగా నవ్వింది మల్లి. ☆